కథ

# దేవుడు వరమందిస్తే...

- డా. పేటశ్రీ



ఎస్వీ యూనివర్శిటీలో ఎం.ఏ. చదువు పూర్తి అవుతూనే మా ఇంట్లో వాళ్లు నాకెలాగైనా పెళ్ళి చేసేయాలని తహతహలాడారు. ఏ వయసులో ముచ్చట ఆ వయసులో తీరాలని మా వాళ్ళ కోరిక. బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా ఉపయోగముండదని మా అమ్మ అంటుండేది.

మా అమ్మ నాన్నలు వయసు కొస్తూనే, సరైన సమయంలో పెళ్ళిళ్ళు చేసుకోవడం వల్ల వాళ్ళకు నలభైఏళ్ళు వస్తూనే చెట్టంత కొడుకులు, కూతురు చేతికి అందొచ్చారని వాళ్ళ సంబరం.

ఎం.ఏ. పూర్తి అవుతూనే నేను పిహెచ్.డి.లో చేరాలని... డాక్టరేట్ అవార్డు అయ్యేంత వరకు పెళ్ళి చేసుకోనని భీష్ముడిలా భీష్మించుకున్నాను. సరే ఇక చేసేదేముంది? రాజుకన్నా మొండి బలవంతుడని మా వాళ్లు నన్ను దేవరపోతులా వదలి పెట్టేశారు.

పిహెచ్.డి. చేసే రోజుల్లోనే నాకు ఎస్వీయూలో ఆంత్రోపాలజీ విభాగంలో 'ఫొటో గ్రాఫర్ కమ్ ఆర్టిస్ట్' ఉద్యోగం వచ్చింది. మా అమ్మ మళ్ళీ పెళ్లంటూ సన్నాయి నొక్కులు నొక్కింది. చిన్న ఉద్యోగం, తక్కువ జీతం. పైగా రీసెర్చ్ పూర్తి కాలేదు... అంటూ మళ్ళీ తప్పించుకున్నాను. ఆంత్రోపాలజీలో ఉద్యోగం వచ్చిన సంవత్సరానికి పిహెచ్.డి. పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను పొందాను. అప్పట్నుంచి నా పేరు ముందు 'డాక్టర్' తగిలించు కొని మురిసిపోయేవాణ్ణి. మా అమ్మకు చదువు రాదు. వేలిముద్ర అంటే మహా ఆనందంగా వేస్తుంది. మా నాయన ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. పెద్ద చదువుల గురించి పెద్దగా అవగాహన లేకపోయినా ఇతరుల నుండి ఏ చదువు చదివితే ఏ ఉద్యోగం వస్తుందో తెలుసుకునే వారు.

మొత్తానికి మా అమ్మానాన్నలు నేను లెక్చరర్ ఉద్యోగం కోసం చదువుకున్నానని అనుకునే వారు. నాకైతే ఆ ఉద్యోగం వచ్చిన కాలానికిలే అనే అపనమ్మకం ఉండేది. నేను పరిశోధనలో చేరినప్పుడు మా చెల్లెలికి, పరిశోధన పూర్తి చేశాక మా తమ్ముడికి పెళ్ళిళ్లై పోయాయి. నా కన్నా ముందు మా

తమ్ముడు ఉద్యోగరీత్యా స్థిర పడటంతో వాడి పెళ్లి నా ప్రోద్బలంతోనే జరిగిపోయింది.

ఎస్వీ యూనివర్శిటీలో లెక్చరర్ ఉద్యోగాలకు ప్రకటన వచ్చింది. మా తెలుగు అధ్యయన శాఖలో కూడా ఒక ఎస్.సి., మరో ఓ.సి. క్యాటగిరిలలో లెక్చరర్ పోస్టులున్నాయని తెలిసి నేను దరఖాస్తు చేసుకున్నాను. ఓ.సి. కేటగిరీలో నూటరెండు మంది దరఖాస్తులు ఆంధ్రదేశం నుండి, పక్క రాష్ట్రాల నుండి వచ్చాయని విని ఆశ్చర్యపోయాను. అప్పటికే నేను నాలుగు పరిశోధక గ్రంథాలను వెలువరించాను. నావి పాతిక పరిశోధనా వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. అనేక జాతీయ సదస్సుల్లో పరిశోధక వ్యాసాలను సమర్పించాను. ఇది నా బయోడేటా.


ఇంటర్వ్యూకి వెళ్లాను. ఓ.సి. కేటగిరీలో లెక్చరర్ పోస్టుకు సెలక్ట్ అయ్యాను. నాకు పెద్ద ఉద్యోగం వచ్చేసింది. మా వాళ్ళ ఆనందానికి అవధుల్లేవు. అయితే నాకు లెక్చరర్ ఉద్యోగం వచ్చిన మూడు నెలలకే మా నాన్న గుండెపోటుతో మరణించారు. పెద్దవాడిగా నేను కొరివి పెట్టాలి. అయితే కొరివి పెట్టిన పదకొండు నెలలలోపే నేను పెళ్లి చేసుకోవాలి. ఎందుకైనా మంచిదని చుట్టుపక్కలుండే పెద్దలు మా తమ్ముడితో మా నాన్నకు కొరివి పెట్టించారు.

మా నాన్నకు మూడవ నెల విస్తరి వేశాక మళ్ళీ నా పెళ్ళి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎక్కడ సంబంధాలకు వెళ్ళినా అమ్మాయిలు నాకు నచ్చేవారు కారు. రోడ్లో వెళ్తున్నప్పుడు అమ్మాయిలు ఎంతో అందంగా! ఆకర్షణీయంగా కనిపిస్తారు. అయితే మనం పెళ్ళి చూపులకు వెళ్లినప్పుడు అమ్మాయిలు ఇంత ఘోరంగా ఎందుకుంటారో నాకర్థమయ్యేది కాదు. కనీసం యావరేజిగా ఉన్నా సర్దుకు పోవచ్చు.

ఒక డాక్టర్‌ను చూశాను. అన్నీ ఉన్నా ఆ అమ్మాయి బాగా నలుపు. పెళ్లి చూపుల్లో ఒకరినొకరు మాట్లాడుకునే విధంగా అరేంజ్ చేశారు. నేనింటికొచ్చి మా అమ్మతో ఆ అమ్మాయిని చేసుకుంటానని చెప్పాను. మా పిన్నమ్మ కొడుకులు, మా తమ్ముడు ఆ అమ్మాయి బొగ్గుకన్నా నల్లగా ఉంటుందని చెప్పేశారు. మా అమ్మ ఒప్పుకోలేదు. ''కోడలు నలుపైతే కులమంతా నలుపే'' అని వాళ్ళెంత కట్నమిచ్చినా నేనొప్పుకోనురా'' అనేసింది.

నేను మౌనంగా ఉండేసరికి అమ్మాయి అన్నదమ్ములు నేను కట్నం మనిషినేమోననుకొని కట్నం పెంచుతూ వచ్చారు. అయినా నేను లొంగ లేదు. అబ్బో, ఇప్పుడా డాక్టర్ చెన్నైలో పెద్దకార్పొరేట్ హాస్పటల్లో గొప్ప పేరున్న స్పెషలిస్ట్ అంటూ నన్ను దెప్పి పొడుస్తుంటారు నాకు మధ్యవర్తిత్వం వహించిన వ్యక్తులు. అయినా నేనేమీ బాధ పడను.

ఎట్టకేలకు చదువు, ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఉన్న అమ్మాయిని చూపించారు. అమ్మాయి నాకు నచ్చింది. పైగా అగ్రికల్చరల్ బి.ఎస్సీ. పిల్లలు పుడ్తే బాగా చదివించుకుంటుందనే నమ్మకం నాకు కల్గింది. అయితే మా బావకు మాత్రం ఈ సంబంధం ఇష్టం లేదు. ఆయనకు తెలిసిన వాళ్ళ అమ్మాయిని చూపించాడు. వాళ్లైతే బాగా కట్నం ఇస్తారని తిరుపతిలో పెద్ద ఇల్లు రాసిస్తారని, లక్షల విలువచేసే ఎకరా భూమి ఇస్తారని ఆ సంబంధాన్నే చేసుకోవాలని నామీద ఒత్తిడి పెంచాడు. అయితే ఆ అమ్మాయి అందంలో ఫర్వాలేదు. అయితే ఎటొచ్చీ చదువే ఇంటర్మీడియట్. పైగా ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతోందని బిల్డప్. నాకు ఆస్తికన్నా చదువుకొన్న అమ్మాయే ముఖ్యం అని నాకు నచ్చిన అమ్మాయినే పెళ్లి చేసుకున్నాను. మా అమ్మ కూడా డబ్బు మనిషి కాదు. నా ఇష్టానికే వదిలి పెట్టేసింది. మా బావ కూడా చెడ్డోడేమీ కాదు. ''ఇంత ఆస్తిని నువ్వు ఎన్నేళ్ళు కష్టపడి సంపాదిస్తే వస్తుంది?'' అని నచ్చజెప్పడానికి చూశాడు. అయినా నా ఇష్ట ప్రకారం జరిగింది.



నాకు ముప్పై మూడేళ్ళకు లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. ముప్పై ఐదేళ్ళకు పెళ్ళైంది. ఉద్యోగం ఆలస్యమే పెళ్ళీ ఆలస్యమే. పిల్లలు కూడా మేమెందుకు వెంటనే పుట్టాలి? అని అనుకున్నారో ఏమో? పెళ్లైన పన్నెండేళ్ళకు పుట్టారు. అదీ మగ పిల్లలు కవలలు పుట్టారు. పుట్టినన్ని రోజులు పుట్టలేదేనని దిగులు. తీరా పుట్టాక వయసు మీద పడ్డాక పుట్టారేనని దిగులు. నాకు మొన్ననే యాభయ్యో సంవత్సరం ప్రారంభమైంది. నా పిల్లలకేమో నాల్గవ సంవత్సరం నడుస్తోంది.

నేను యూనివర్శిటీలో రోజూ సాయంత్రం పూట వాకింగ్ చేసి తర్వాత ఇంటికెళ్తాను. ఉదయం వాకింగ్ నాకు కుదరదు. ఒకరోజు థీసిస్ కరెక్షన్లో పడి సాయంత్రం ఆరున్నర గంటలకు వాకింగ్ బయలుదేరాను. ఆర్ట్స్ బ్లాక్ నుండి వెలుపలకొచ్చి, ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, బయో కెమిస్ట్రీ, హెచ్ బ్లాక్ హాస్టల్, డి. బ్లాక్ హాస్టల్ హెల్త్‌సెంటర్ మీదుగా రెండు కి.మీ. నడిచి మెయిన్‌బిల్డింగ్ ముందుకొచ్చాను. మెయిన్‌బిల్డింగ్ ముందు పెద్ద రావి వేపచెట్లు పెనవేసుకొని ఉన్నాయి. చెట్ల కిందుండే రచ్చబండ మీద ఆంజనేయస్వామి రాతి విగ్రహముంది. ఆ విగ్రహానికి అందరూ పూజలు చేసి, ఆ జంట చెట్లను ప్రదక్షిణం చేస్తుంటారు. నాకు కూడా ఆ ఆంజనేయస్వామంటే చాలా ఇష్టం. మాకు పిల్లలు పుట్టక ముందు నేను, మా ఆవిడ అప్పుడప్పుడు వచ్చి ఆ రావి, వేప చెట్లకు ప్రదక్షిణం చేసి ఆంజనేయస్వామికి దణ్ణం పెట్టుకొని వెళ్ళేవాళ్ళం. సరిగ్గా ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర కొస్తూనే యూనివర్శిటీలో కరెంటు పోయింది. చీకటిని బట్టి చూస్తుంటే తిరుపతంతా కరెంటు పోయినట్లుంది. చిమ్మచీకటి... యూనివర్శిటీ నిండా భయంకరమైన విషసర్పాలున్నాయి. కుందేళ్ళ,



జింకలు, చిరుతపులులు, ఎలుగుబంట్లు తరచూ సంచరిస్తుంటాయి. చిరుత పులులు చీకటి పడ్డప్పుడు నెలకొక సారైనా వర్శిటీలోకి జొరబడి కుక్కలను నోట కరుచుకొని వెళ్ళి వర్శిటీలోని చెట్లెక్కి తిని అవశేషాలను వదలి వెళ్తుంటాయనడానికి నిదర్శనం పత్రికలే. నేను ఎందుకైనా మంచిదని ఆంజనేయస్వామి విగ్రహం ఉండే రచ్చబండ మీద కూర్చున్నాను. వేసవి శెలవుల వల్ల జనసంచారం లేనే లేదు.

మా గురువు నరసింహారెడ్డి రిటైర్‌మెంట్ పెన్షన్ ఆర్డర్ కాపీని నేనే తీసుకొచ్చి సార్ కిచ్చాను. అది గుర్తుకొచ్చింది. ఆయన సర్వీసులో ఉండగానే సార్ ఇద్దరు కొడుకులు స్థిర పడిపోయారు. ఇద్దరికీ పెళ్లిళ్ళు అయిపోయాయి. మనవళ్ళు, మనవరాళ్లతో సార్ సంతోషంగా గడుపుతున్న సమయంలో రిటైర్డ్ అవడం వల్ల ఆయన 'ది కంప్లీట్ మ్యాన్'గా ఫీలైపోతూ హుషారుగా కనిపిస్తారు.

మరి నేను... ఇక సరిగ్గా పది సంవత్సరాలకు రిటైర్డై పోతాను. అప్పటికి నా పిల్లలు ఎనిమిదవ తరగతి చదువుతుంటారు. కనీసం టెన్త్‌క్లాస్ కూడా పూర్తి చేయరు. దిగులుగా తలపట్టుకొని కూర్చున్నాను. ఆలోచనా సాగరంలో మునిగిపోయాను. పిల్లలు పుట్టకపోతే ఒక బాధ. పుట్టే మరో బాధ. మనిషిలోనే ఉంది నిరంతరం అసంతృప్తి...

చేతులు వెనక్కి చాచుకొని తలపైకెత్తి ఆకాశం వైపు దిగాలుగా చూశాను. ఉన్నట్టుండి పెద్ద మెరుపు రావి, వేప చెట్ల జంటను తాకింది. చెట్టు దేదీప్యమానంగా వెలిగి పోతోంది. సింధూరం రంగులో ఆంజనేయస్వామి విగ్రహం మిరుమిట్లు గొల్పుతోంది. ఒక పెద్ద ఆకారం గద భుజం మీద పెట్టుకొని నా ఎదుట నిలిచాడు.

నేను నమ్మలేక పోయాను... స్వామీ! మీరు ఆంజనేయస్వామి కదూ? అన్నాను...

''అవును''

''మీరు ఇలా ప్రత్యక్షమవడం ఏమిటి?''

''నేను చిరంజీవిని... నీకు తెలియదా?''

''నిజమే... నిజమే... తెలుసు'' మరి ఇప్పుడెందుకిలా దర్శన మిస్తున్నారు?''

''నీ కోసమే... నా విగ్రహమొక్కడ కనిపించినా నువ్వు భక్తితో నమస్కరిస్తావు... పైగా నువ్వు రచించిన గ్రంథాలన్నీ భారతీయ, సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తుంటాయి. అందుకే నీ మనసులోని చింతను పోగొట్టడానికి ప్రత్యక్షమయ్యాను. నువ్వు తిరుపతిలో ఉన్నావు కాబట్టి ఏడుకొండలకు ప్రతీకగా ఏడు వరాలనిస్తున్నాను. వేకువ జామున చీకటిలో జనులు సంచారం లేనప్పుడు రావి, వేప చెట్ల ద్వయానికి వేలాడ గట్టుండే గంటలను కొట్టినప్పుడల్లా నేను ప్రత్యక్షమవుతాను, నువ్వు కోరిన వరాన్నిస్తాను. అయితే పొరపాటున కూడా ఎనిమిదవ వరం కోరకూడదు. అలా కోరితే కాలచక్రం వెనక్కు తిరిగి మళ్లీ నువ్వెక్కడున్నావో అక్కడే పడేస్తుంది'' అన్నాడు ఆంజనేయస్వామి.

''స్వామీ! నాకు ఎన్నేళ్ళు ఆయుష్షు?''

''అది సృష్టి రహస్యం... దాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ చెప్పకూడదు. అత్యాశకు పోకుండా ఏడు వరాలిచ్చానుగా ఏం కావాలో కోరుకో''.

''ఏం లేదు స్వామీ! నా బిడ్డలు టెన్త్‌క్లాస్ పాసయ్యే వరకు నేను ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలి. టెన్త్ క్లాసు నుండి వారికి ఊహ వస్తుంది. మంచి చెడులు తెలుస్తాయి. లోకంలో ఎలా బతకాలో తెలుసుకుంటారు... అందుకని...''

''నా కర్థమైంది. పిల్లలు టెన్త్ పాసయ్యేవరకు నీకే డోకా ఉండదు'' అంటూ ఆంజనేయ స్వామి మాయమై పోయాడు.

పేజీలు తిరగేసినట్లు పన్నెండు సంవత్సరాలు గడచిపోయాయి.

ఒకరోజు తొలి వేకువన చీకట్లో ఆంజనేయ స్వామి దగ్గరకెళ్ళి గంట కొట్టి స్వామిని ఆహ్వానించాను. స్వామి ప్రత్యక్షమయ్యాడు.

''నా పిల్లలు ఇంటర్మీడియట్ పూర్తి చేస్తే చూడాలని ఉంద''ని కోరుకున్నాను.

''తథాస్తు'' అని రెండోవరం ఇచ్చి స్వామివారు మాయమై పోయాడు.

అదేవిధంగా ఇంటర్మీడియట్ పూర్తయ్యాక ఎం.సెట్‌లో ర్యాంకులు తెచ్చుకోవాలని మూడవ వరం కోరుకున్నాను. కోరుకున్నట్లే జరిగింది.

వాళ్ళు ఇంజనీరింగ్, మెడిసిన్‌లలో చదువు పూర్తిచేసేది నేను చూడాలని నాల్గవ వరం కోరుకున్నాను.... కోరిక తీరింది.

వాళ్ళకు మంచి ఉద్యోగాలు రావాలని ఐదోవరం కోరుకున్నాను... నెరవేరింది.

మంచి పెళ్ళి సంబంధాలు రావాలని కోరుకున్నాను... ఆరవ వరం ప్రకారం వచ్చాయి. అనుకున్నట్లే పెళ్లిళ్లు అయిపోయాయి.

మనవళ్ళు, మనవరాళ్ళతో ముద్దుముచ్చట్లు తీరాలని ఏడవ వరాన్ని కోరుకున్నాను... వరం వల్ల ఆ అనుభవాలు, అనుభూతులు దక్కాయి. శరీరం భారమైంది. నడవలేక నడుస్తున్నాను. వార్ధక్యం మనిషికి శాపమైనా అనుబంధాలు, ఆత్మీయతలు అనే పాశాలు నన్ను కట్టి పడేశాయి.

ఎలాగైనా నా మనవళ్ళు, మనవరాళ్ళ పెళ్ళిళ్ళు చూడాలని నా మనసు తహతహలాడు తోంది. మళ్ళీ ఆంజనేయస్వామి విగ్రహం ముందుకెళ్లి యథా ప్రకారం గంట కొట్టాను. స్వామి ప్రత్యక్షమైనాడు. నా కోరికను తెలిపాను.

''ఇది ఎన్నో కోరికో తెలుసా నీకు?'' అని ప్రశ్నించాడు స్వామి. ముందున్న ప్రసన్నత స్వామిలో కనిపించలేదు. పైగా ఉగ్రరూపంతో ఊగిపోతున్నట్లనిపించింది. ''వయసు మీద పడ్డం వల్ల, జ్ఞాపకశక్తి తగ్గడం వల్ల గుర్తుకు రావడం లేదని జంకుతూ అబద్ధమడాడాను.

''నువ్వేకాదు... ప్రతి మనిషీ ఇంతే... సంసార మాయలో పడి తేనెలో పడ్డ ఈగలాగ అందులోని మాధుర్యాన్ని గ్రోలుతూ, బయట పడలేక అక్కడే తనువు చాలిస్తుంటాడు. పరమాత్మ తత్వాన్ని తెలుసుకోలేరు. సర్వసంగ పరిత్యాగులు సంసారాన్ని వీడి భవ బంధాలను తెంచుకోవడం వల్లే మహనీయులౌతారు. నారు పోసిన వాడు నీరు పోయక పోడు. బిడ్డల్ని కనడం, పెంచడం వరకే నీ కర్తవ్యం. ఆపైన తలరాత ఎలాగుంటే అలాగే జరుగుతుంది. దైవచింతన వల్ల అన్నీ శుభాలే జరుగుతాయి. నువ్వు అనుభవించిన ఏడు వరాలన్నీ కలగా మిగిలి పోతాయి. విధికి ఎదురీదడం ఎవరి తరం కాదు. దైవబలంతో మనోబలాన్ని సాధించి సుఖమయ జీవితం వైపు పయనించు.... నీకు అన్నీ శుభాలే... జై... శ్రీరామ్'' అంటూ ఆంజనేయస్వామి మాయమై పోయాడు.

కళ్ళు తెరచి చూశాను... కటికచీకటి... నా జీవితంలో వెలుగులు నింపే విధంగా అప్పుడే కరెంటు వచ్చింది. యూనివర్శిటీలోని సోడియం లైట్ల కాంతిలో చెట్ల కిందుండే ఆంజనేయస్వామి విగ్రహానికి నమస్కరించి వాకింగ్ పూర్తి చేసుకొని ఇంటి కెళ్ళాను.

నా భార్య, బిడ్డలు నా కోసం ఎదురు చూస్తున్నారు, కారులో షికారు కెళ్ళాలని.

*

చిరునామా:
ప్రొ. పేట శ్రీనివాసులురెడ్డి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు స్టడీస్
శ్రీ వెంకటేశ్వరా యూనివర్సిటీ,
తిరుపతి- 517 502
సెల్: 98493 07333



## సమీరా స్వయంవరం?

టాలీవుడ్‌లో ఐరన్‌లెగ్‌గా ముద్ర వేయించుకొని, అటు బాలీవుడ్‌లోనూ, ఇటు టాలీవుడ్‌లోను అవకాశాలు లేక ఖాళీగా కూర్చున్న సమీరా పెళ్లి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చేసింది. తన పెళ్లి వ్యవహారం పెద్దలకి వదలకుండా 'రాఖీ'లాగా స్వయంవరం ప్రకటించాలని నిశ్చయించుకొంది. అయితే 'రాఖీ'లాగా ఆర్భాటంగా కాకుండా సాదాసీదాగా, రహస్యంగా వరుడిని ఎంపిక చేసుకోవాలని అనుకుంటోందట! ఈ వ్యవహారం బహిరంగ రహస్యం కావడంతో సమీరా కోసం పెళ్లికొడుకులు లైను కట్టడం ఖాయం అని అంటున్నారు. వారిలో కుర్ర హీరోలూ ఉండవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.